క్లుప్తంగా

యన్మన్‌గండ్లలో వైద్య శిబిరం



నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్లలో ఆదివారం వివేకానంద విద్యానికేతన్ పూర్వ విద్యార్థులు, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల బృందం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి కృష్ణ ప్రారంభించారు. సబ్ సెంటర్‌లో చిన్న పిల్లలతో పాటు, దంతాలు, కంటి పరీక్షలు, స్త్రీ వ్యాధుల నిపుణులు పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో విష్ణు, లింగంనాయక్, తులసీరాంనాయక్, జహీర్, లక్ష్మయ్య, హన్మంతు, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్టపై పురాతన కాలంలో వెలిసిన రామలింగేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధికి బీసీకాలనీకి చెందిన చిలుక రామస్వామి ఆదివారం రూ.1,01,116, అదేవిధంగా గాజుల మల్లికార్జున్ రూ.51,116, పలువురు విరాళాలు అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నరేందర్ తెలిపారు. ఆలయాభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు.

రాజాపూర్ (బాలానగర్): బాలానగర్ మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయానికి గురుపౌర్ణమి సందర్భంగా మహేష్‌కుమార్‌యాదవ్ నాలుగు మైకెసెట్లను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు సభ్యులకు అందజేశారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్, పూజారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో పని చేస్తున్న తహసీల్దార్లు బదిలీ అయ్యారు. శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జయప్రద, కల్యాణి, అఖిల ప్రసన్నలను నారాయణపేటకు బదిలీ చేశారు. హేమ్లాను నాగర్‌కర్నూల్ జిల్లాకు కేటాయించారు. వీరితో పాటు నారాయణపేట జిల్లాలో పని చేస్తున్న సువర్ణరాజ్, నర్సింగ్‌రావు, అమీర్‌ను మహబూబ్‌నగర్ జిల్లాకు కేటాయించారు. సంగారెడ్డి నుంచి రాజగణేష్, వనపర్తి జిల్లా నుంచి ఫరీదాబేగంను మహబూబ్‌నగర్ జిల్లాకు కేటాయించారు.

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా చందర్‌నాయక్

నవాబుపేట: ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా కొల్లూర్ చెందిన చందర్‌నాయక్‌కు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం వ్యవస్థాపకుడు బెల్లయ్యనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం నియామకపత్రం అందించారు. మండల నాయకులు మండల కేంద్రంలోని బంజార భవన్‌లో చందర్‌నాయక్‌కు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తులసీరాం నాయక్, రాజునాయక్, నర్సింహనాయక్, లింబ్యానాయక్, శంకర్‌నాయక్, భాస్కర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్యుల వివాహ పరిచయ వేదిక

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ వద్ద ఉన్న వాసవి గార్డెన్స్‌లో ఆదివారం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వివాహపరిచయ వేదిక నిర్వహించారు. ఇందులో 250 మంది అబ్బాయిలు, 203 మంది అమ్మాయిలు వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్షుడు శంకర్, రాజయ్య, మురళి, సుధాకర్, మురళీ కృష్ణ, సుధాకర్, ప్రకాష్, వేణుగోపాల్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించండి

మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలో ఉన్న ఎస్సీ వసతిగృహాలలో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కావలి కృష్ణయ్య, ఆంజనేయులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజా పాలనపై దృష్టి పెట్టినందున ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కూడా జిల్లా కేంద్రంలో ఎస్సీ బాలికల వసతిగృహం నూతన భవన నిర్మాణానికి కృషి చేయాలని కోరారు.

హామీలను అమలు చేయాలి

మహమ్మదాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ నాయకుడు రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రుణమాఫీ చేయడంతో రైతులకు సవాలక్ష కొర్రీలు పెడుతున్నారని, అలాంటి ఇబ్బందులు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షాక్‌కు గురైన వానరానికి చికిత్స

అడ్డాకుల: మండల కేంద్రంలో మూడు రోజుల క్రితం ఓ వానరం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కడంతో అనుకోకుండా షాక్‌కు గురైంది. కళ్లు, కాళ్లు కమిలిపోవడంతో అక్కడే ఉండిపోయింది. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు భీమన్నయాదవ్ మరికొందరి సాయంతో ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్న వానరాన్ని వల వేసి పట్టుకుని పశువైద్య సిబ్బందితో చికిత్స చేయించారు. తర్వాత ఇనుప జాలీలో ఉంచి ఆహారం అందిస్తున్నారు.

‘మల్టీపర్పస్’ అవస్థలు

- నెలల తరబడి పంచాయతీ కార్మికులకు అందని జీతాలు
- పెరిగిన పనిభారంతో ఇక్కట్లు



వెన్నాచేడ్ డ్రైడే సందర్భంగా నీటిని పారబోస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు

గండేడ్: ఉదయం నుంచి మొదలు పొద్దుపోయే వరకు ఏదో పనిచేస్తూ క్షణం తీరిక లేకుండా ఉన్నారు. మురుగును తీయడంతో పాటు చెత్తాచెదారాన్ని తొలగించడం వంటి వాటితో ప్రతి పనిలో కష్టపడుతూ గ్రామాల్లో వెలుగు రేఖలు చిందిస్తున్నారు. గ్రామాభ్యుదయంలో వారే కీలకం అని ప్రశంసలు తప్ప నెల నెల వారికి వేతనాలు మాత్రం అందడం లేదు. దీంతో వారి కుటుంబాలు అప్పుల తిప్పల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. పంచాయతీల్లో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్ల పరిస్థితి ఇందుకు నిదర్శనం. ఉమ్మడి గండేడ్ మండలంలో 49 పంచాయతీలు ఉండగా 167 మంది వర్కర్లు ఉన్నారు. గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో పెద్ద పంచాయతీలైన మహమ్మదాబాద్‌లో 15 మంది, వెన్నాచేడ్‌లో 12 మంది చొప్పున ఉన్నారు. గండేడ్, కొంరెడ్డిపల్లి, నంచర్ల, పగిడ్యాల్, సల్కర్‌పేట్, పెద్దవార్వాల్‌లో 5 నుంచి 10 వరకు సిబ్బంది ఉండగా మిగతా అన్ని గ్రామాల్లో 1 నుంచి నలుగురు వరకు సిబ్బంది ఉన్నారు.

10 నెలలుగా అందని వేతనాలు..

పంచాయతీలో పనిచేసే మల్టీ పర్పస్ వర్కర్లకు ప్రతి నెల రూ.9,500 వేతనం ఇవ్వాలి. వీరికి దాదాపు పది నెలలుగా వేతనాలు అందడం లేదు. పెద్ద పంచాయతీల్లో వనరులు ఉండడం మూలంగా ఒకటి రెండు నెలల వేతనాలు అందాల్సి ఉండగా మిగతా పంచాయతీల్లో మాత్రం ఆరు నుంచి పది నెలలుగా వేతనం అందడం లేదు. వీరికి కేవలం పంచాయతీలే జీతాలను భరించాలని ప్రభుత్వం నిర్దేశించింది. పంచాయతీ పరిధిలో ఉన్న వనరుల ద్వారా జనరల్ ఫండ్‌లో జమచేసి వారి వేతనాలు అందించాలి. కాని గ్రామాల్లో 95 శాతానికి పైగా ఇంటి పన్నులు తప్ప ఇతర వనరులు ఏవీ లేవు. దీంతో వేతనాలు చెల్లింపులు కష్టంగా మారింది. గత ఏడాది అక్టోబరు నెలలో ఎన్నికల కోడ్ రావడంతో రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. కేంద్ర ఆర్థిక సంఘం నిధులు కూడా విడుదల కాలేదు. దీంతో జీతాలు ఇవ్వలేక పంచాయతీలు చేతులు ఎత్తేశాయి. జనవరిలో సర్పంచ్‌ల పదవీ కాలం కూడ ముగియడంతో పాలకవర్గాలు లేవని ఫిబ్రవరి నుంచి కేంద్రం నిధులు ఇవ్వలేదు. కాగా పనిభారంతో కార్మికులు సతమతమవుతున్నారు.

జీతం ఇవ్వడం లేదు



గ్రామంలో ప్రతి పని చేస్తున్నాం. ఏ చిన్న అవసరం ఉన్న మమ్మల్ని వాడుకుంటున్నారు. ఉదయం నుంచి పంచాయతీ పనుల్లోనే మునిగి తేలుతున్నాం. ఒక్క రోజు కూడా ఖాళీగా ఉండే పరిస్థితి లేదు. మా పంచాయతీలో ముగ్గురం మల్టీ పర్పస్ వర్కర్లం ఉన్నాం. ముగ్గురికి కూడా పది నెలల నుంచి వేతనం అందలేదు. అడిగితే ఈ రోజే రేపంటున్నారు.

– చెంచు బుజ్జమ్మ, మల్టీ పర్పస్ వర్కర్, పగిడ్యాల్

జీతంపైనే ఆధారపడ్డాం..



పంచాయతీలో చేరినప్పటి నుంచి కూడా వచ్చే జీతంపైనే ఆధారపడి బతుకుతున్నాం. బయట ఇంకో పనిచేసుకోలేని పరిస్థితి. ఉదయం లేవగానే ఇల్లు వదిలి పనుల కోసం గ్రామంలోకి వెళ్తున్నాం. పని కూడా ఎక్కువ కావడంతో తంటాలు పడుతున్నాం. గతంలో నెల నెల జీతం ఇచ్చేవారు, ఇప్పుడు ఏకంగా నెలల తరబడి జీతం ఇవ్వకపోవడంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది.

– దాసరి వెంకటేష్, మల్టీ పర్పస్ వర్కర్, చిన్నవార్వాల్

వనరులు లేకనే ఇబ్బంది



నిధులు లేకపోవడంతో మల్టీపర్పస్ వర్కర్ల జీతాలు చెల్లించడం ఇబ్బందిగా ఉంది. ఎన్నికల రావడం, సర్పంచ్‌ల పదవీకాలం ముగియడం, వనరులు పెద్దగా లేకపోవడంతో పంచాయతీలకు నిధులు రావడం లేదు. పెద్ద పంచాయతీల్లో కొద్దిగా మెరుగ్గా ఉన్నా, చిన్న పంచాయతీల్లో మాత్రం నెలల తరబడి వేతనాలు అందడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా అదే పరిస్థితి ఉంది. ప్రభుత్వం నిధులిస్తేనే వారి వేతనాలు పంచాయతీలు చెల్లిస్తాయి.

– దేవన్న, ఎంపీడీఓ, ఉమ్మడి గండేడ్ మండలం

ఘనంగా ఖర్గే జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కేక్‌కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మల్లికార్జున్ ఖర్గే దేశంలోనే అతిపెద్ద పార్టీ అయిన కాంగ్రెస్‌కు జాతీయ అధ్యక్షుడిగా ఉన్నారని, ఆయన జీవితం మాకందరికీ ఆదర్శమని అన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సుజిత్ యాదవ్

జిల్లా కేంద్రం కుర్హినిశెట్టికాలనీ కుమ్మరివాడికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు అడ్వకేట్ పార్వతి సుజిత్‌యాదవ్ ఆదివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ సమద్‌బిన్ అబ్దాత్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎంఐఎం పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని హైదరాబాద్‌లోని ఉప్పుగూడ కార్పొరేటర్ సమద్‌బిన్ అబ్దాత్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హాదీ అధ్యక్షతన కార్యకర్తల సమావేశంలో కార్పొరేటర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా పార్టీకి మంచి ఆదరణ ఉందన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని కోరారు. ఎన్నికల్లో అధిక సంఖ్యలో పార్టీ కౌన్సిలర్లు గెలిచేలా కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జాబిర్ బిన్ సయీద్, జాకీర్, సాదతుల్లా హుస్సేని, కౌన్సిలర్ ముస్తాక్ రషీద్, ముజంబిల్, మహెబూబ్ పాల్గొన్నారు.

కల్వర్టుకు తాత్కాలిక మరమ్మతు

నవాబుపేట: మండలంలోని మల్లారెడ్డిపల్లి, యన్మన్‌గండ్ల రోడ్డులో వర్షాలకు శనివారం కల్వర్టు ధ్వంసమైంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఆదివారం అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. తాత్కాలికంగా ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ నాన్యనాయక్ చెప్పారు. వర్షాలు తగ్గిన అనంతరం కల్వర్టు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు.

‘లైంగికదాడులను అరికట్టాలి’

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రోజురోజుకూ లైంగికదాడులు పెరిగిపోతున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సినిమాల్లో అశ్లీల డైలాగులు, చిత్రాలు, సెల్‌ఫోన్‌లో నీలి చిత్రాల దృశ్యాలు, మహిళలను కించపరిచే సీరియల్స్ ఈ ఘటనలకు కారణమవుతున్నాయని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



తోటమైసమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

స్టేషన్ మహబూబ్‌నగర్: గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం పట్టణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో గల ద్వారకామాయి సాయి మందిరంలో సామూహిక సాయి వ్రతాలతోపాటు పల్లకీ సేవ నిర్వహించారు. గణేష్‌నగర్ సాయిబాబా ఆలయంలో, వెంకటేశ్వర కాలనీలోని షిరిడీ సాయి మందిరంలో గురుపౌర్ణమి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక లక్ష్మీనగర్‌కాలనీలోగల రాజరాజేశ్వరి మాత, షిరిడీ సాయిబాబ ఆలయంలో గురుపౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కుర్హినిశెట్టికాలనీలోగల తోటమైసమ్మ అమ్మవారి దేవాలయంలో ఆషాఢం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గండేడ్: వెన్నాచేడ్‌లో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

జడ్చర్ల టౌన్: సాయినగర్ సకలదేవతల ఆలయంలో సాయిబాబ ఆలయానికి భక్తులు పోటెత్తారు. రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న దత్తమందిరంలో దత్తాత్రేయకు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి పురస్కరించుకుని కల్యాణం నిర్వహించారు.

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ సమీపంలో షిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

దేవరకద్ర: మండల కేంద్రంలో షిరిడీ సాయి బాబాకు అభిషేకాలు, ప్రత్యేకంగా అలంకారం చేసి ఘనంగా పూజలు నిర్వహించారు. వీరప్పయ్య స్వామి ఆలయంలో ఘనంగా పూజలు జరిగాయి.

అడ్డాకుల: అడ్డాకుల, కందూర్ స్టేజీ సమీపంలోని సాయిబాబా దేవాలయం, మూసాపేట అయ్యప్ప గుట్టపై ఉన్న సాయిబాబా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

నవాబుపేట: గురుకుంట సాయి ఆలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు పెద్దఎత్తున హాజరై పూజలు చేశారు. మండల కేంద్రంలోని ఆలయంలో సాయి వ్రతం, యజ్ఞం నిర్వహించారు.



అమిస్తాపూర్ షిరిడీ సాయిబాబా ఆలయంలో..



వెన్నాచేడ్ షిరిడీసాయిబాబా ఆలయంలో..



జిల్లా కేంద్రం గణేష్‌నగర్ షిరిడీ సాయి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



దేవరకద్రలో..



మూసాపేట రామలింగేశ్వరాలయంలో..



నవాబుపేటలో..



జడ్చర్ల సాయినగర్‌లో పల్లకీసేవ

మురుగు తొలగించిన మున్సిపల్ సిబ్బంది



భూత్పూర్ చౌరస్తాలో మురుగును తీయిస్తున్న కమిషనర్ సురేందర్‌రెడ్డి



అమిస్తాపూర్ వద్ద యథావిధిగా వాహనాలు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రహదారి

సాక్షి ఎఫెక్ట్..

భూత్పూర్: పట్టణంలోని 9వ వార్డులో మురుగుతో పాటు గడ్డిని ఆదివారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. అమిస్తాపూర్ వద్ద రహదారిపై రాకపోకలు యథావిధిగా కొనసాగించారు. శనివారం ‘సాక్షి ఫోన్ ఇన్’ కార్యక్రమంలో భూత్పూర్ మున్సిపాలిటీ కమిషనర్ సురేందర్‌రెడ్డితో చేపట్టగా 10 వార్డులకు చెందిన ప్రజలు వివిధ సమస్యలు విన్నవించారు. ఆదివారం దోమల బెడద తీర్చాలని స్థానికులు కోరగా, కమిషనర్ స్పందించి స్వయంగా తానే దగ్గరుండి 4, 10 వార్డుల్లో మురుగు, పూడిక తీయించే పనులు పర్యవేక్షించారు. అమిస్తాపూర్ వద్ద రహదారి విస్తర్ణలో భాగంగా ఒకే దారిలో రెండు వాహనాలు వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయనే దానిపై స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు ఒకే దారిలో వాహనాలను తొలగించి యథావిధిగా భూత్పూర్ నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే మార్గాన్ని కొనసాగించారు.

డ్రైయినేజీ, రోడ్ల సౌకర్యం కల్పించండి



టంకరలో కూలిన ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వేగంగా విస్తరిస్తున్న తమ కాలనీలో డ్రైయినేజీ వ్యవస్థ సరిగా లేదని, ఇళ్ల మధ్య ఓపెన్ ప్లాట్లలో మడుగులా మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోతోందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి 11వ వార్డు పరిధిలోని బాలాజీనగర్ వాసులు విన్నవించారు. చాలా వరకు మట్టి రోడ్లే ఉన్నాయని, ప్రస్తుతం వర్షాకాలం కావడంతో బురదమయంగా మారుతున్నాయని వాపోయారు. ఆదివారం ఈ కాలనీలో పర్యటించిన ఆయన ఈ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఐదో వార్డు పరిధిలోని ఏనుగొండ, రామకృష్ణానగర్ తదితర కాలనీలలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పర్యటించారు. సమస్యలు నెలకొన్నాయని ఆయా కాలనీలవాసులు వివరించారు. వీటిని త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, కౌన్సిలర్ వనజ, ప్రశాంత్, బాలరాజు, నర్సింహులు, సందీప్, అశోక్, రామస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటా..

హన్వాడ: వర్షం కారణంగా ఇళ్లు కూలిపోయిన బాధితులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని టంకరలో కూలిపోయిన ఇళ్లను పరిశీలించారు. ఆపదలు చెప్పిరావని ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. వర్షాకాలం పూర్తయ్యేవరకు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని తెలిపారు. నిర్వాసితులను పునరావాస కేంద్రాల్లో ఉంచి వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బాధితులకు వంట పాత్రలు, సరుకులు, బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిష్ట్యానాయక్, డీటీ ఖలీద్, మహేందర్, నవనీత, లయన్ నటరాజ్, కృష్ణయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రభుత్వం రుణమాఫీని తూతూ మంత్రంగా కాకుండా అర్హులైన రైతులందరికీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సాగర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కూడా కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు వచ్చిన రైతులను పరిగణలోకి తీసుకుని రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఉమ్మడి జిల్లాలో వందలాది మందికి టైఫాయిడ్, మలేరియా, డెంగీ ఇతర వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం సంచార వైద్యశాల ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి రాములు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. వర్షాల బారిన ఇల్లు కూలిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. వర్షాలకు మృతి చెందిన గొర్రెలు, పశువులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కిల్లే గోపాల్ మాట్లాడుతూ పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగమైన ఉదండాపూర్, వల్లూరులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి నిర్వాసిత గ్రామాలలో ప్రజలను ఆదుకోవాలని, ఉదండాపూర్, కరివెన ప్రాజెక్టుకు అధిక నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కురుమూర్తి, చంద్రకాంత్, మోహన్, రాజ్‌కుమార్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ప్రజాపాలనలో ఉమ్మడి జిల్లా అభివృద్ధి చెందాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రజాపాలనలో ఉమ్మడి జిల్లా అభివృద్ధి చెందాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నరసింహ అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26, 27 తేదీలలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని విష్ణు కన్వెన్షన్ (రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవన్)లో సీపీఐ ఉమ్మడి జిల్లాల పార్టీ సమితి సభ్యులు, అనుబంధ ప్రజా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, మండల కార్యదర్శులు, ముఖ్య నాయకులకు రెండు రోజులపాటు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బాలకిషన్, సురేష్, సత్యనారాయణరెడ్డి, లక్ష్మీపతి, శివకృష్ణ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న ఇళ్లకు నోటీసులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. పూరిగుడిసెలు, తాత్కాలిక గుడారాలలో నివాసం ఉంటున్న వారికి సైతం నోటీసులు జారీ చేశారు. పాతబజార్‌లోని 6వ వార్డు కౌన్సిలర్ ఎస్.రమేష్, వార్డు అధికారి జ్ఞానేశ్వర్, ఆర్పీలు శ్యామలమ్మ, శ్రీలతలు ఆదివారం పర్యటించి శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి నోటీసులు అందజేశారు.

పాత ఇళ్లలో నివాసం ప్రమాదం

హన్వాడ: పెద్దర్పల్లిలో పాడుబడిన ఇళ్లు, పాత మట్టిమిద్దెలు, గోడలను స్థానికులతో కలిసి బీజేపీ నాయకుడు రఘురాంగౌడ్ ఆదివారం పరిశీలించారు. వివరాలను నమోదు చేసుకుని పంచాయతీ కార్యదర్శికి నివేదించారు. అదేవిధంగా మండలంలోని యారోనిపల్లిలో పూరిగుడిసెల్లో జీవనం సాగిస్తున్న వారికి బీజేపీ నాయకుడు శావుకుల తిర్పతయ్య టార్పాలిన్ కవర్లను పంపిణీ చేశారు.